క్లుప్తంగా

బాలాపూర్ గణనాథుడికి విరాళం



ఉత్సవ కమిటీ నిర్వాహకులకు చెక్కు అందజేస్తున్న పర్వతాలురెడ్డి

బడంగ్‌పేట్: ప్రసిద్ధి చెందిన బాలాపూర్ గణనాథుడి విగ్రహానికి అదే ప్రాంతానికి చెందిన పీపీ రెడ్డి గ్రూప్ చైర్మన్ పన్నాల పర్వతాలురెడ్డి ప్రతి ఏటా విరాళం అందిస్తున్నారు. ఇందుకుగాను ఈ సంవత్సరం గణనాథుడి ఉత్సవాలకు రూ.2.65 లక్షల చెక్కును గురువారం పర్వతాలురెడ్డి, కుమారులు వంశీరెడ్డి, కిరణ్‌రెడ్డి కలిసి గణేశ్ ఉత్సవ సమితి నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు వంగేటి లక్ష్మారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కళ్లెం ఎల్లారెడ్డి, విష్ణురెడ్డి, పన్నాల రాజేందర్‌రెడ్డి, టేకుల సుధాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

విద్యుత్ సమస్య పరిష్కారానికి చర్యలు

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్



అధికారులతో మాట్లాడుతున్న కేఎల్లార్

తుక్కుగూడ:నియోజకవర్గంలోని ప్రతీ గ్రామంలో విద్యుత్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కేఎల్లార్ అన్నారు. గురువారం మున్సిపాలిటీలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విద్యుత్ అధికారులతో ఆయన సమావేశమయ్యారు.ఈ సందర్భంగా వారి నుంచి పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.నియోజకవర్గ వ్యాప్తంగా లోటట్వేజీ, ట్రిప్ కావడం, సబ్‌స్టేషన్ల కొరత తదితర సమస్యలను గుర్తించామన్నారు. ఈ సమస్యలను విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లామని, ఇందుకు గాను రూ.11 కోట్ల బడ్జెట్‌కు ప్రతిపాదనలు తయారు చేశామన్నారు. కార్యక్రమంలో విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

యూజీడీ పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి, కాలనీవాసులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడ శ్రీహిల్స్ కాలనీలో గురువారం గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనులు త్వరగా పూర్తి చేసి కాలనీవాసులకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీని అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు.కార్యక్రమంలో ఏఐసీసీ కో–ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి, ఏదుళ్ల ప్రతాప్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి కె.శ్యామ్‌రావు, కోశాధికారి సీహెచ్.వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఓటరు జాబితా విడుదల



ఓటరు లిస్టును ప్రచురిస్తున్న ఎంపీడీఓ సరిత

కందుకూరు: మండల పరిధిలోని 35 గ్రామ పంచాయతీలతో పాటు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీడీఓ సరిత ఆధ్వర్యంలో ఓటరు లిస్టుతో పాటు పోలింగ్ స్టేషన్ల జాబితాను విడుదల చేశారు. మండల పరిధిలో 312 వార్డులు, 312 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని, ఓటర్లు మొత్తం 51,706 మంది ఉన్నారని ఆమె తెలిపారు. వీటిపై ఏవైనా అభ్యంతరాలు, మార్పులు, చేర్పులు ఉంటే రాతపూర్వకంగా ఈ నెల 30వ తేదీలోపు అందజేయాలని ఈ సందర్భంగా ఎంపీడీఓ సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ గీత, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మీసేవ కేంద్రాల ఏర్పాటుకు నోటిఫికేషన్ జారీ

మొయినాబాద్: మున్సిపల్, మండల పరిధిలో 3 మీసేవ కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందని మండల తహసీల్దార్ గౌతమ్‌కుమార్ తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్, మండల పరిధిలోని కనకమామిడిలో మీసేవ కేంద్రాల ఏర్పాటుకు అర్హులైన అభ్యర్థులు సెప్టెంబర్ 20 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థులు ధ్రువపత్రాలతో పాటు జిల్లా కలెక్టర్ పేరుతో రూ.500 డీడీ తీసి దరఖాస్తుకు జతచేసి ఆర్డీఓ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

డెంగీ గుప్పిట్లో బస్తీలు!



- నరూర్‌నగర్‌లో 26 కేసులు నమోదు
- చాపకింది నీరులా విషజ్వరాలు
- ఆందోళన చెందుతున్న ప్రజలు
- పట్టించుకోని వైద్య ఆరోగ్యశాఖ!

హుడాకాంప్లెక్స్: విష జ్వరాలు ప్రజలకు వణుకు పుట్టిస్తున్నాయి. ఏకధాటి వర్షాలు, వరదలు. వీటికి తోడి పారిశుద్ధ్యలోపం. వెరసి దోమలు విస్తృంతగా పెరిగాయి. అసలే సీజనల్ వ్యాధుల కాలం. ఆపై పెరిగిన దోమలు, ఈగలతో బస్తీవాసులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే అధికారికంగా సరూర్‌నగర్ ఆరోగ్య కేంద్రం పరిధిలో జూలై చివరి నాటికి 16 డెంగీ కేసులు నమోదు కాగా, ఆగస్టులో కేవలం 25 రోజుల్లోనే పది కేసులు నమోదు కావడం కలవరపాటుకు గురిచేస్తోంది. ఇక టైఫాయిడ్ బాధితులకు లెక్కలేకుండా పోయింది

ఫాగింగ్‌ను మరిచిన మున్సిపాలిటీ

ప్రస్తుత సీజనల్‌లో పగటి పూట ఎక్కువగా నిద్రించే చిన్నారులు, వృద్ధులు దోమల బారిన పడుతున్నట్లు సమాచారం. డెంగీ కారక దోమల నియంత్రణకు ఎప్పటికప్పుడు పల్లెలు, పట్టణాల్లో ఫాగింగ్ చేపట్టాలి. కానీ ఆ దిశగా పారిశుద్ధ్య సిబ్బంది, అధికారులు చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం.. సిబ్బంది నిర్లక్ష్యం వలన ప్రజల ఆరోగ్యం గాలిలో దీపంలా మారింది. వారు తీసుకోవాల్సిన చర్యలు మరచి.. జాగ్రత్తలు తీసుకోవాలంటూ ప్రజలకు సూచిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

నివారణ చర్యలు మేలు

వర్షాల కారణంగా వీధుల్లో గుంతలు ఏర్పడే అవకాశం ఉంది. వీటిల్లో రోజుల తరబడి నీరు నిల్వ ఉంటుంది. దీని కారణంగా దోమల సంతతి పెరుగుతుంది. పార్కింగ్ చేసిన వాహనాలు, పనికి రానివి దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. ఇంటిపై ఉన్న పాత టైర్లు, డబ్బాలను ఎప్పటికప్పుడు తొలగించాలి. తాగి పడేసిన కొబ్బరి బొండాల్లో వాన నీరు చేరడం. రోజుల తరబడి నిల్వ ఉండటంతో దోమలకు నిలయంగా మారుతోంది. ఇంటి పరసరాల్లో ఇవి లేకుండా చూసుకోవాలి. ఇంటి ఆవరణలో అందం కోసం ఏర్పాటు చేసే పూల కుండీలు ఒకింత కారణం. ఎప్పటికప్పుడు వాటిలో చేరిన నీటిని తొలగించాలి. పాదళ్లను శుభ్రం చేయడం వలన దోమలను అరికట్టవచ్చు. ప్లాస్టిక్ గ్లాసులు, టీ కప్పు, ప్లాస్టిక్ కవర్లలోకి నీరు చేరుతుంది. వీటిలో దోమలు గుడ్లుపెట్టే అవకాశం ఉంది. వీటిని ఇంటి పరిసరాల్లో ఉండకుండా చూసుకోవాలి. పిల్లలు, వృద్ధులు ఎక్కువగా మధ్యాహ్న సమయంలో నిద్రపోతుంటారు. కాళ్లు, చేతులు పూర్తిగా కప్పబడే దుస్తులు ధరించేలా చూసుకోవాలి.

పరిశుభ్రత ముఖ్యం



మురికి వాడలు, బస్తీల్లో సంపులు తక్కువగా ఉంటాయి. రెండు మూడు రోజులకు ఒకసారి సరఫరా అయ్యే తాగునీటిని పెద్ద పెద్ద డ్రమ్ముల్లో నిల్వచేస్తుంటారు. వీటికి మూతలు ఉండకపోవడం వలన డెంగీ కారక దోమలు వృద్ధి చెందే అవకాశం ఉంది. విధిగా డ్రమ్ములు, బకెట్లపై మూతలు పెట్టాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

– డాక్టర్ అర్చన, సరూర్‌నగర్ ఆస్పత్రి



కందుకూరులో మహిళా రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

యూరియా సరఫరాలో విఫలం

- ఎమ్మెల్యే సబితారెడ్డి

కందుకూరు: యూరియా సరఫరాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఎమ్మెల్యే సబితారెడ్డి విమర్శించారు. గురువారం కందుకూరులో యూరియా కోసం వచ్చిన రైతులను కలిసిన అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో తొలకరి కంటే ముందే ఎరువులను సిద్ధంగా ఉంచి, రైతుబంధు వేసి అన్ని విధాలా అండగా ఉండేవారన్నారు. ప్రజా ప్రభుత్వం అని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రైతులను పట్టించుకోవడం లేదని విమర్శించారు. రైతులను రోడ్డుపైకి వచ్చేలా చేస్తున్నారని మండిపడ్డారు. పంటల సాగు వివరాలు అన్ని ఉన్నా ఎందుకు యూరియా ముందుగా రైతులకు అందుబాటులో ఉంచలేదని ప్రశ్నించారు. కేంద్రంలోని బీజేపీ యూరియా ఇచ్చామని చెబుతుంటే, రాష్ట్రంలోని ప్రభుత్వం మాత్రం రాలేదంటుందన్నారు. పక్క రాష్ట్రంలో యూరియా సరఫరా అవుతున్నప్పుడు ఇక్కడ ఎందుకు కావడంలేదో ఆలోచించాలన్నారు. మరోపక్క యూరియాను బ్లాక్ మార్కెట్‌లో బస్తా రూ.450 చొప్పున విక్రయిస్తున్నారని ఆరోపించారు. యూరియా సరఫరాలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. ఒకరిపై ఒకరు నెపం వేసుకోవడం మాని యూరియాను సరఫరా చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆమె వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నియోజకవర్గం ఉపాధ్యక్షుడు జి.లక్ష్మీనర్సింహారెడ్డి, పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేఘనాథ్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ ఎస్.శేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది కలిగించొద్దు



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి

- ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి

కందుకూరు: రైతులకు ఇబ్బంది కలగకుండా యూరియా పంపిణీని చేపట్టాలని ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి ఆదేశించారు. గురువారం సాయంత్రం ఆర్డీఓ కార్యాలయంలో ఆయన సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కందుకూరు పీఏసీఎస్ కార్యాలయంలో టోకెన్ల ద్వారా రైతులకు యూరియా పంపిణీ చేపట్టామన్నారు. ఈ రోజు 450 బస్తాల యూరియాను పంపిణీ చేశామన్నారు. శుక్రవారం మరో 500 బస్తాల యూరియా రానుందన్నారు. టోకెన్ నంబర్ 200 నుంచి 450 వరకు సరఫరా కానున్న యూరియాను శుక్రవారం రైతులకు పంపిణీ చేస్తామన్నారు. మిగతా టోకెన్లకు మరో లోడ్ వచ్చిన వెంటనే అందిస్తామన్నారు. టోకెన్‌తో పాటు పట్టాదారు పాస్‌పుస్తకం లేదా వన్ బీ జిరాక్స్‌లతో వస్తే యూరియా పంపిణీ చేస్తామన్నారు. మిగతా రైతులకు తగిన సమయంలో యూరియా తెప్పించే ప్రయత్నం చేస్తున్నామని, అందరూ సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఏఓ లావణ్య, సీఐ సీతారామ్, పీఏసీఎస్ కార్యదర్శి ఎస్.యాదగిరిరెడ్డి పాల్గొన్నారు.

గణనాథుడికి.. యజ్ఞోపవీతం



ఆలయ కమిటీ సభ్యులకు కండువాను అందజేస్తున్న నాయకుడు రవికుమార్

పహాడీషరీఫ్: వినాయక చవితిని పురస్కరించుకొని జల్‌పల్లి మున్సిపాలిటీ శ్రీరాంకాలనీ శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రతిష్ఠించిన గణనాథుడికి శ్రీ భక్త మార్కండేయ పద్మశాలీ పరస్పర సంఘం, కాంగ్రెస్ పార్టీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు మన్న రవికుమార్ ఆధ్వర్యంలో 21 అడుగుల యజ్ఞోపవీతం, కండువాను బుధవారం రాత్రి బహూకరించారు. అంతకుముందు బాలాపూర్ గణేశ్‌కు కూడా 51 అడుగుల యజ్ఞోపవీతం, కండువాను సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆంజనేయులు, రమేశ్, శ్రీహరి, నారాయణ, శ్రీనివాస్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాప్రాంగణంలో పిచ్చిమొక్కల తొలగింపు



ప్రాంగణంలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు, చెత్తను తొలగిస్తున్న వాకర్స్ క్లబ్ నిర్వాహకులు

బడంగ్‌పేట్: బడంగ్‌పేటలోని దావుత్‌ఖాన్‌గూడలో గల సిరిపురం యాదయ్య క్రీడా ప్రాంగణంలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలను వాకర్స్ క్లబ్ నిర్వాహకులు ముందుకొచ్చి తొలగించారు. ఈ సందర్భంగా మైదానంలో ఏపుగా పెరిగిన గడ్డి, పిచ్చి మొక్కలు, ఇతర వర్థ్యాలను తొలగించి శుభ్రం చేశారు. మున్సిపల్ అధికారులకు ఎన్నిమార్లు విన్నవించినా స్పందించకపోడంతో తాము ముందుకొచ్చామని క్లబ్ సభ్యులు తెలిపారు. క్లబ్ సభ్యుల సేవలను పలువురు అభినందించారు. కార్యక్రమంలో పోలీసులు, ప్రభుత్వ ఉపాధ్యాయులు, పెద్ద ఉద్యోగాల్లో ఉన్నవారు, కార్పొరేటర్లు, స్థానికులు ఇతరులు ఉన్నారు.

యూరియా కోసం బారులు



కందుకూరు పీఏసీఎస్ కార్యాలయం వద్ద క్యూలో నిలబడిన రైతులు

కందుకూరు: యూరియా కోసం రైతులు నానా పాట్లు పడుతున్నారు. గురువారం కందుకూరు పీఏసీఎస్ వద్ద యూరియా కోసం ఉదయం నుంచే రైతులు పెద్దఎత్తున చేరుకొని క్యూలో నిలబడ్డారు. కాగా మొత్తం 450 బస్తాలు మాత్రమే యూరియా అందుబాటులో ఉండగా.. అందరికీ సరిపోవని గుర్తించిన అధికారులు పోలీసుల పర్యవేక్షణలో ఉన్న వాటిని ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున అందించారు. మిగిలిన వారికి స్లిప్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితారెడ్డి రైతుల సమస్య అడిగి తెలుసుకొని అధికారులను యూరియా విషయమై ప్రశ్నించారు. రైతులకు సరిపడా యూరియా పంపించాలని కలెక్టర్‌ను ఆమె కోరగా.. వెంటనే ఒక లారీ పంపిస్తానని ఆయన హామీ ఇచ్చారు. కాగా చాలామంది రైతులు సమయానికి యూరియా పంటలకు వేయకపోతే పైరు దెబ్బతింటుందని వాపోతున్నారు.

పంట నమోదు తప్పనిసరి



వరిపంటను పరిశీలిస్తున్న ఏఈఓ శిరీష

నందిగామ: రైతులు తాము వేసిన పంటలకు సంబంధించిన వివరాలను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని ఏఈఓ శిరీష అన్నారు. మండల పరిధిలోని మోత్కుల గూడలో గురువారం ఆమె పర్యటించి పలు పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు తమ భూములలో ఏఏ పంటలను పండిస్తున్నారో వ్యవసాయశాఖ వద్ద నమోదు చేయించుకోవాలని, దీంతో పంటలను విక్రయించడం సులభతరం అవుతుందని తెలిపారు. అదేవిధంగా వరిపంట ఎరుపు రంగులోకి మారడంతో ఆమె పరిశీలించి రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. పంట చేనులోని నిల్వ నీటిని తొలగించాలని, మళ్లీ నీరు పెట్టాలని సూచించారు.

జల్‌పల్లి చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లు



చెరువు వద్ద పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్ వెంకట్రామ్

పహాడీషరీఫ్: జల్‌పల్లి పెద్దచెరువు వద్ద వినాయక నిమజ్జనానికి సంబంధించి మున్సిపాలిటీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 3, 5, 7, 9 రోజులలో జల్‌పల్లి, పహాడీషరీఫ్, శ్రీరాంకాలనీ, మధుబన్‌కాలనీ, లక్ష్మీగూడ, వాంబేకాలనీ, కాటేదాన్, ఉడంగడ్డ తదితర ప్రాంతాల నుంచి భక్తులు ఈ చెరువులో నిమజ్జనం చేస్తారు. ఈ నేపథ్యంలో వినాయక ప్రతిమలను తీసుకొచ్చే వాహనాలకు ఇబ్బందులు తలెత్తకుండా చెరువు కట్టపై చదును పనులు చేయడంతో పాటు బురద ఉన్న చోట కంకర పరుస్తున్నారు. రాత్రి పూట అంధకారం లేకుండా వీధి దీపాలకు మరమ్మతులు సైతం చేయిస్తున్నారు. ఈ పనులను గురువారం మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్, మేనేజర్ అర్షద్, డీఈ ఇష్రత్ ఆయేష పర్యవేక్షించారు. మున్సిపల్ సిబ్బందిని వాటర్ ప్రూఫ్ జాకెట్లతో అందుబాటులో ఉంచడంతో పాటు తొలిరోజు ఒక క్రేన్‌ను సిద్ధంగా ఉంచారు. 5వ రోజు నుంచి అవసరమైన మేరకు యంత్రాలను అందుబాటులోకి తీసుకొస్తామని కమిషనర్ తెలిపారు. భక్తులు జాగ్రత్తలు పాటించి ప్రమాదాలకు తావులేకుండా నిమజ్జనం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌బాబు, పర్యావరణ అధికారి ఎం.శ్రీనివాస్, సూపర్‌వైజర్ బి.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భళా బాలాపూర్ మండపం



స్వర్ణగిరి ఆలయ నమూనాలో ఏర్పాటు చేసిన గణేశ్ మండపం

బడంగ్‌పేట్: బాలాపూర్ గణనాథుడి చేతిలోని లడ్డు పవిత్రత అందరికీ తెలిసిందే. అయితే ఏటా గణనాథుడి ఎదుట వేస్తున్న మండపం ప్రసిద్ధి చెందిన దేవాలయాల నమూనాలతో ఏర్పాటు చేస్తూ భక్తులను ఆకట్టుకుంటున్నారు. ఈ ఏడాది 2025కుగాను స్వర్ణగిరి టెంపుల్ నమూనాలో మండపాన్ని ఏర్పాటు చేశారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలను సైతం లెక్కచేయకుండా యుద్ధ ప్రాతిపదికన మండప ఏర్పాట్లను పూర్తి చేశారు. స్వర్ణగిరి ఆలయ మండపాన్ని తిలకించేందుకు భక్తులు క్యూకడుతున్నారని ఉత్సవ సమితి అధ్యక్షుడు కళ్లెం నిరంజన్‌రెడ్డి తెలిపారు.

దివ్యాంగులపై వివక్ష తగదు

హయత్‌నగర్: దివ్యాంగులను ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందని, ఎన్నికలప్పుడు కాంగ్రెస్ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి(వీహెచ్‌పీఎస్) రాష్ట్ర కార్యదర్శి చెలమండ్ల గోవర్ధన్, కోర్ కమిటీ వైస్ చైర్మన్ అందె రాంబాబు అన్నారు. వీహెచ్‌పీఎస్ 19వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం హయత్‌నగర్ అంబేడ్కర్ విగ్రహం సమీపంలో జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. వికలాంగుల పింఛన్ రూ.6 వేలకు పెంచుతామని మాట ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 20 నెలలు గడిచినా ఆ మాటే ఎత్తడం లేదని, పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా లాభం లేకుండా పోయిందన్నారు. రాజకీయాల్లో వికలాంగులకు ప్రాధాన్యమిచ్చి నామినేటెడ్ పోస్టులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 9న మందకృష్ణ మాదిగ నాయకత్వంలో 20 లక్షల మందితో సికింద్రాబాద్‌లో నిర్వహించే మహాసభకు వికలాంగులు భారీగా తరలిరావాలన్నారు. ఈ కార్యక్రమంలో వేణు, మల్లేష్, కల్పన, రవి, లక్ష్మారెడ్డి, జంగయ్య పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తాం



సమస్యను డీఈకి తెలుపుతున్న నవారు మల్లారెడ్డి

- కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, డివిజన్ అధ్యక్షుడు మల్లారెడ్డి

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడ 24వ డివిజన్‌లోని జయశంకర్ కాలనీలో గత నాలుగేళ్లుగా వేసిన డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, త్వరలో సమస్య పరిష్కారానికి కృషిచేసేలా చర్యలు తీసుకుంటున్నామని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, 24వ డివిజన్ అధ్యక్షుడు నవారు మల్లారెడ్డి అన్నారు. గురువారం జయశంకర్ కాలనీలో డీఈఈ వెంకన్న, ఏఈఈ హరీశ్‌తో కలిసి నవారు మల్లారెడ్డి కాలనీలో పర్యటించారు. చిన్నపాటి వర్షానికే మురుగునీరు, కాలనీ అంతర్గత రోడ్లపై పారుతోందని, అలాగే వర్షాలకు డ్రైనేజీలు పొంగి ఇళ్లల్లోకి రివర్స్ వస్తున్నాయని కాలనీవాసులు అధికారులతో మొరపెట్టుకున్నారు. అధికారులు అన్ని డ్రైనేజీ మ్యాన్ హోళ్లను తెరిపించి చూశారు. డ్రైనేజీ లైన్లు వేసేటప్పుడు లెవలింగ్ సరిగా కలపకుండానే కాంట్రాక్టర్ లైన్లు పూర్తి చేసినట్లు నిర్ధారణకు వచ్చారు. డీఈ వెంకన్న వెంటనే కమిషనర్ సరస్వతితో మాట్లాడి సమస్యను వివరించారు. బకెట్ మిషన్ తెప్పించి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా నవారు మల్లారెడ్డి మాట్లాడుతూ.. చాలా ఏళ్లుగా ఇక్కడి ప్రజలు డ్రైనేజీ సమస్యతో సతమతమవుతున్నారన్నారు. వర్షాలు తగ్గిన తర్వాత డ్రైనేజీలకు మరమ్మత్తులు చేయించి శాశ్వత పరిష్కారం చూపుతామని కాలనీవాసులకు ఆయన హామీ ఇచ్చారు.

జైజై గణేశా..

మహేశ్వరం నియోజకవర్గంలో వినాయక చవితి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. అన్ని గ్రామాల్లో వాడవాడలా వివిధ రూపాల్లో కొలువుదీరిన బొజ్జగణపయ్యకు భక్తులు, నిర్వాహకులు వివిధ పత్రాలు, పూలు సమర్పించి పూజలు చేశారు. ఉండ్రాళ్లు, చెరుకు గడలు, వివిధ రకాల పిండి వంటలను స్వామివారికి నైవేద్యంగా సమర్పించి దండాలయ్యా.. ఉండ్రాలయ్యా.. దయుంచయ్యా దేవా అంటూ వేడుకున్నారు. గురువారం రెండోరోజు స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



బడంగ్‌పేట్: బాలాపూర్ గణనాథుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే సబితారెడ్డి



బడంగ్‌పేట్: బాలాపూర్ గణనాథుడి వద్ద మాజీ మేయర్ పారిజాత, నాయకులు



బడంగ్‌పేట్: అల్మాస్‌గూడలో ఏసీపీ కాశిరెడ్డి, సీఐ శంకర్‌నాయక్, ఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి



కందుకూరు: పూజలో పాల్గొన్న భక్తులు



రావిర్యాలలో..



తుక్కుగూడలో..